సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



ఎయిర్‌పోర్టు వద్దు

ఉద్దానాన్ని విధ్వంసం చేసే ఎయిర్‌పోర్టు వద్దని అంటున్నారు. ప్రజామోదం లేకుండా చేయడం సరికాదన్నారు. - 8లో



పేరు అమీర్.. తీరు బడా చోర్..

బైక్ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. మెకానిక్‌గా పనిచేస్తూ అత్యాశతో దొంగగా మారాడు. - 8లో

న్యూస్‌రీల్

ల్యాబ్ టెక్నీషియన్ మురళి సస్పెన్షన్

అరసవల్లి: ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖాధికారులకు చిక్కిన ల్యాబ్ టెక్నీషియన్ గొండు మురళిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లుగా జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కల్యాణ్‌బాబు ప్రకటించారు. బుడితి సీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న మురళిని ఏసీబీ పోలీసులు అరెస్ట్ చేయడంతో నిబంధనల ప్రకారం ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేశామని వివరించారు.

అసంబద్ధంగా టెన్త్ పరీక్షల కార్యాచరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధత కోసం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక పూర్తిగా అసంబద్ధంగా ఉందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ ముఖ్య ప్రతినిధులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, పట్నాన వెంకట రమణ, పూడి లక్ష్మీపతి, కుప్పన్నగారి శ్రీనివాసరావు, గొడబ మేరీప్రసాద్, మీనాకుమారి ఖండించారు. ఈ మేరకు సోమవారం వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకదాని వెంట మరొకటి విద్యాశాఖ విడుదల చేస్తున్న ఉపాధ్యాయ వేధింపుల ఉత్తర్వులకు ఈ కార్యాచరణ ప్రణాళిక ఒక ఉదాహరణగా ఉందని పేర్కొన్నారు. రెండో శనివారం ఆదివారాల్లో కూడా పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం బాధాకరమని తెలిపారు. మూడు నెలలపాటు ఒక్కరోజు కూడా సెలవు లేకుండా పనిచేస్తున్న ఉపాధ్యాయులను, విద్యార్థులను ఇంత చులకనగా చూడటం ఎంతమాత్రం తగదని ఆరోపించారు. సంక్రాంతి సెలవు దినాలలో సైతం కేవలం మూడు రోజులు మాత్రమే సెలవులను తీసుకొని పండుగ చేసుకోమని విద్యాశాఖ చెబుతుండటం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ఉత్తర్వులను తక్షణమే నిలుపుదల చేసి విద్యార్థులకు ఉపాధ్యాయులకు శని, ఆదివారాలతోపాటు పండగ సెలవుల వెసులుబాటు విధిగా కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


శ్రీముఖలింగంలో శివస్వాములు



ప్రధాన ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న శివస్వాములు

జలుమూరు: కార్తీక మాసం ముగింపు పోలి పాడ్యమిని పురస్కరించుకుని శ్రీముఖలింగం దేవాలయానికి శివస్వాములు సోమవారం అధిక సంఖ్యలో వచ్చారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు చేసి శివయ్యకు ఇరుముడి సమర్పించి దీక్ష విరమించారు. జిల్లా నలుమూలలతోపాటు అధికంగా పాలకొండ, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

వర్మీ కంపోస్టు విక్రయం ప్రోత్సహించాలి



వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం బయట ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మీ కంపోస్టు పంచాయతీల నుంచి స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేస్తే వారు విక్రయిస్తారని చెప్పారు. దూసి పంచాయతీ నుంచి వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పంచాయతీలకు క్యూ ఆర్ కోడ్ ఉండాలని, దాని ద్వారా వర్మీ కంపోస్టు పేమెంట్ తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. వర్మీ కంపోస్టు అందరూ కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు. మున్సిపాలిటీల నుంచి వర్మీ కంపోస్టు స్టాల్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారికి ఫోన్ చేసి వర్మీ కంపోస్టు విక్రయంపై రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఆర్గానిక్ పంటలు పండించే రైతుల ఫోన్ నంబర్లు మార్కెటింగ్ శాఖ ఏడీ వద్ద ఉంటాయని చెప్పారు. వర్మీ కంపోస్టు రైతులకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఉద్యానవన శాఖ, ఉపాధి హామీ నుంచి వర్మీ కంపోస్టు ఉపయోగాలపై రైతులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీఓ కె.భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



దీపాల లోగిలి

పోలి పాడ్యమి వేళ అరసవల్లి ఇంద్రపుష్కరిణిలో దీపాలు మెరిశాయి. ఇంద్ర పుష్కరిణితో పాటు నాగావళి నదిలోనూ దీపాలు విడిచిపెట్టారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం




వెండి వాకిలి..



ఆదిత్యుడి గర్భాలయం వెండి వెలుగులతో మెరవనుంది. స్వామికి విశాఖకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు 24.5 కిలోల వెండితో దాదాపు రూ.30 లక్షల ఖర్చుతో గర్భాలయ ప్రధాన తలుపులకు వెండి తాపడాన్ని చేయించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శన సమయం నుంచి గర్భాలయ వెండి తలుపులు తెరిచి ఆదిత్యుని దర్శనానికి అవకాశమిస్తున్నామని ఆలయ ఈఓ వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు తెలియజేశారు. – అరసవల్లి

శివాలయంలో నాగుపాము



ఎచ్చెర్లలోని శ్రీ గిరిజా సమేత ముక్కంటీశ్వర ఆలయంలో గర్భాలయంలో సోమవారం నాగుపాము కనిపించింది. శివలింగానికి అభిషేకాలు చేసేటప్పుడు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి(సోమసూత్రం)నుంచి పాము లోపలకు వచ్చింది. గర్భగుడిలో సర్పాన్ని చూసిన భక్తులు మొక్కుకోవడం కనిపించింది.

–ఎచ్చెర్ల క్యాంపస్

10 నుంచి పరీక్షలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 10వ తేదీ నుంచి పలు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. 10వ తేదీ నుంచి ఇంజినీరింగ్ ఐదో సెమిస్టర్ పరీక్షలు, 13వ తేదీ నుంచి ఏడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని అన్నారు. వర్సిటీ అఫిలియేషన్ కళాశాలలకు సంబంధించి బీపీఈడీ, డీపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని అన్నారు.

–ఎచ్చెర్ల క్యాంపస్



పోస్టర్ ఆవిష్కరణ



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో రెండు రోజుల పాలిటెక్ ఫెస్ట్–2024 నిర్వహించనున్నారు. ఈ పోస్టర్‌ను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య, మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ గోవిందనాయుడు, విభాగాల హెచ్‌ఓడీలు విడుదల చేశారు. జిల్లా స్థాయిలో ఈ ఫెస్ట్ నిర్వహిస్తారు. ప్రాజెక్టుల ప్రదర్శనలో మొదటి ప్రాజెక్టుకు రూ.25000, రెండో ప్రాజెక్టుకు రూ.10,000 అందజేయనున్నట్లు తెలిపారు. –ఎచ్చెర్ల క్యాంపస్

ఉచిత శిక్షణ

ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి కోర్సులు నేర్పించనున్నట్లు నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీల్డ్ టెక్నీషియన్ అండ్ ఎయిర్ కండిషనర్ (ఏసీ టెక్నీషియన్) కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెన్త్ క్లాస్, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సుకు 6 నెలల పాటు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 7569077449 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. – ఆమదాలవలస





సారవకోటలో పులి !

సారవకోట మండలంలోనే పులి సంచారం ఉందని అటవీ శాఖాధికారులు చెబుతు న్నారు. రెండు రోజుల కిందట జమచక్రం పంట పొలాలలో పాదముద్రలు కనిపించడంతో అటవీ శాఖ సిబ్బంది పరిశీలించారు. అక్కడ నుంచి ఆదివారం నాటికి సోమయ్యపేట పంట పొలాల్లో పాదముద్రలు గుర్తించారు. అయితే సోమవారం నాటికి మండలంలోని అన్నుపురం, వాబ చుట్టుపక్కల ఉన్న కొండల్లో ఉండవచ్చునని భావిస్తున్నారు. మండలంలోని పలు ప్రాంతాలలో సోమవారం తాము పరిశీలించామని బీట్ అధికారి శివ తెలిపారు. – సారవకోట




తడిసిన ధాన్యం తడి కళ్లలో దైన్యం

పండిన పంట అమ్ముకోలేక వర్షానికి తడిచిపోయి, మొలకెత్తిన ధాన్యం చూపిస్తున్న నరసన్నపేట రైతు గోడు ఇది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి ఎండబెట్టిన ధాన్యం మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిచి ముద్ద వడంతో ఇలాంటి రైతులు తేరుకోలేకపోతున్నారు.

వజ్రపుకొత్తూరు మండలంలో బెండి గ్రామానికి చెందిన ఈ రైతు పరిస్థితి చూడండి. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు కోసిన వరి పంట నీట మునిగింది. పొలంలోకి భారీగా నీరు చేరింది. అప్పటికే చేను పూర్తిగా తడిచిపోయింది. ఇప్పుడా పొలంలోని వర్షపు నీరును బయటికి తోడుతున్నారు. చేతికందిన పంట వర్షార్పణం కావడంతో ఆ రైతు చెందుతున్న ఆందోళన అంతా ఇంతా కాదు.



- సకాలంలో ధాన్యం కొనుగోలు చేయని కూటమి ప్రభుత్వం
- ఫెంగల్ ప్రభావంతో తడిచిన ధాన్యం
- జిల్లా వ్యాప్తంగా అన్నదాతకు తీవ్ర నష్టం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పొలాల్లో నీరు రైతు కంట కన్నీరు తెప్పిస్తోంది. తడిచిన ధాన్యం రైతు తడి కళ్లలో దైన్యాన్ని ప్రతిబింబిస్తోంది. టెక్నాలజీ వాడకంలో తమకంటే గొప్పవారెవరూ లేరని చెప్పుకునే చంద్రబాబు ప్రభుత్వం రైతు కన్నీరు మాత్రం తుడవలేకపోయింది. చిన్నపాటి వర్షానికి రైతుకు నష్టం వాటిల్లుతుంటే.. కనీసం కొనుగోలు కేంద్రాలు పెంచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయలేకపోయింది.

నిండా మునిగిన రైతులు

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకుందామంటే రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో చేతికొచ్చిన పంట నీటి పాలైంది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కోసిన వరి పంట నీట మునిగింది. దిబ్బలేసిన చేను తడిచి ముద్దయింది. గాలులకు కోతకు సిద్ధంగా ఉన్న వరిచేను నేలకొరిగింది. దీంతో రైతుకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. దీనికంతటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా చెప్పవచ్చు.

కొనుగోలు కేంద్రాలే తెరవని దుస్థితి..

జిల్లాలో నవంబర్ మొదటి వారంలోనే వరి కోతలు ప్రారంభమయ్యాయి. 15వ తేదీకొచ్చేసరికి 50శాతం కోతలైపోయాయి. నవంబర్ చివరికొచ్చేసరికి 70నుంచి 80శాతం కోతలు అయ్యాయి. సీజన్‌ను దృష్టించుకుని ప్రభుత్వం అప్రమత్తమవ్వాలి. కొనుగోలు కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోళ్లు చేయాలి. కానీ, కూటమి ప్రభుత్వానికి కనీసం పట్టలేదు. కక్ష సాధింపులు, వేధింపులు, డైవర్షన్ పాలిటిక్స్ మీద దృష్టి పెట్టి పండిన పంటను గాలికొదిలేసింది. నవంబర్ చివరి వరకు కొనుగోలు కేంద్రాలే ప్రారంభించలేదు. ఇక, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు కనీస అవగాహన కల్పించలేదు. రైతుల్ని చైతన్యపరిచేలా ప్రచారం కూడా చేయలేదు. జిల్లా పరిషత్‌లో సర్వసభ్య సమావేశం జరిగాకనే యంత్రాంగం కదిలింది. అంతవరకు చేష్టలుడిగి చూసింది. ఆ తర్వాత వేగవంతం చేసిందా అంటే అదీ లేదు.అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి చేతులు దులుపుకుంది. ఇంతలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు వచ్చేశాయి. ఇంకేముంది అమ్ముకోవడానికి రైతులు సిద్ధం చేసిన ధాన్యం తడిచి ముద్దయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా 402 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా డిసెంబర్ నెలలోకి వచ్చేసరికి 247 కేంద్రాలనే ప్రారంభించారు. దాదాపు 155 కేంద్రాలు కనీసం తెరవను కూడా తెరవలేదు. 5లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 33,633మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు అధికారిక రికార్డుల్లో చూపిస్తోంది. వాస్తవ పరిస్థితి దేవుడికే ఎరుక.

రైతుల పరిస్థితి అగమ్యగోచరం

ఇప్పటికే తేమ శాతం పేరుతో అదనంగా ధాన్యం తీసుకుంటున్న పరిస్థితుల్లో తడిచిన ధాన్యాన్ని ఏ విధంగా తీసుకుంటారోనన్న భయం రైతులకు పట్టుకుంది. దిబ్బలు తడిచిపోవడం, రాశులు నానిపోవడం, పొలాల్లో వర్షపు నీరు చేరడం వంటి పరిస్థితులు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టినా తడిచిన ధాన్యం ఆరాలంటే కొన్ని రోజులు పట్టక తప్పదు. పొలాల్లో చేరిన నీరు ఇంకాలంటే వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడి అమ్మితే ఎంత వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇవన్నీ రైతుకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

ప్రభుత్వమే ముంచేసింది..

ధాన్యం ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని రైతులు ఆశ పడి ఎక్కడికక్కడ రాశులు పోసి ఉంచారు. కొన్నిచోట్ల దిబ్బలు వేసి ఉంచుకున్నారు. మరికొన్ని చోట్ల పొలాల్లోనే నూర్పులేసి ఉంచుకున్నారు. కొందరైతే రహదారుల వెంబడి ధాన్యం రాశులు పోశారు. వర్షానికి, గాలులకు ధాన్యం చెమ్మగిల్లకుండా పరదాలు, టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. కానీ ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. మోస్తరు వర్షపాతం నమోదైంది. నవంబర్ 30వ తేదీన 162.4మిల్లీమీటర్లు, డిసెంబర్ ఒకటో తేదీన జిల్లా వ్యాప్తంగా 155.3మిల్లీ మీటర్ల వర్షం పడింది. 2వ తేదీ ఉదయం 8గంటల నాటికి 400మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాలు పడ్డాయి. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలు, పొలాల్లో ఉన్న వరి కంకులు పూర్తిగా తడిచిపోయాయి. పండి ఉన్న వరి చేను కోతకు పనికిరాకుండా పోయాయి. ధాన్యం కుప్పలు దాచుకోలేని దుస్థితి చోటు చేసుకుంది. కొన్నిచోట్ల పరదాలు, టార్పాలిన్‌లు దొరక్కపోవడంతో అలాగే ఉంచేయాల్సిన పరి స్థితి ఏర్పడింది. పొలాల్లో నీటిని తోడేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. తడిచిన చేను ను తరలించేందుకు నానా కష్టాలు పడుతున్నా రు. ఎలా చూసినా రైతుకు నష్టమే మిగిలింది.

మా బంగారం మాకు ఇస్తారా లేదా..?



గార ఎస్‌బీఐ మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

గార: గార స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో బంగారం తనఖాపెట్టిన ఖాతాదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. దాదాపు మూడు గంటల పాటు ఉద్యోగులు బ్యాంకులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఉదయం 9 గంటలకే బంగారం తనఖాదారులు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. మెయిన్ గేట్ మూసివేసి అడ్డంగా నిలుచున్నారు. బ్యాంకు సిబ్బంది ఒక్కొక్కరు వచ్చినా లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఎస్‌ఐ ఆర్.జనార్ధన బ్యాంకు వద్దకు వెళ్లి ఖాతాదారులతో మాట్లాడినా బ్యాంకు తెరిచేందుకు ఒప్పుకోలేదు. నవంబర్ 12, 13వ తేదీల్లో ఖాతాదారులకు వడ్డీలు కట్టాలని మెసేజ్‌లు రావడంతో వారంతా ఆందోళన చేపట్టడం, డిసెంబర్ 2వ తేదీకి మీ వస్తువులు ఇస్తామంటూ బ్యాంకు సిబ్బంది హామీ ఇవ్వడంతో అప్పట్లోనే ప్రజా ప్రతినిధులు, పోలీసులతో చర్చించి నిరసనలు వాయిదా వేసుకున్నారు. బ్యాంకు సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో శ్రీకాకుళం నుంచి అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ రామరాజు వచ్చి కేసు కోర్టులో డిసెంబర్ 14కు వాయిదా పడిందని, అప్పటివరకు ఆగాలని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఖాతాదారులు తామంతా బ్యాంకును నమ్మి పెట్టామని, కేసుతో తమకు సంబంధం లేదని, ఇప్పటికే మానసికంగా, ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం, కాదంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ప్రైవేటు కేసు వేసుకుంటే మీ బంగారం వచ్చే అవకాశముందని సిబ్బంది చెప్పే ప్రయత్నం చేసినా, మేం తప్పు చేయకుండా కేసులు ఎందుకు వేస్తామని వాదించారు. మాజీ ఎంపీటీసీ జల్లు రాజీవ్, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్‌లు బాధితులు మద్దతుగా మాట్లాడారు. ఏడాది పూర్తవుతున్నా ఇప్పటికీ తనఖాదారులకు బంగారం ఇవ్వట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో సమావేశంలో ఉన్న రీజినల్ మేనేజర్‌తో వీడియోకాల్‌లో మాట్లాడించి, మంగళవారం బ్యాంకు వద్దకు వస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్నం 12.25 నిమిషాలకు బ్యాంకు తలుపులు తెరుచుకున్నాయి.

క్లుప్తంగా

డయాలసిస్ కేంద్రం పరిశీలన



రోగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఉద్దానం ప్రాంతంలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న కిడ్నీ వ్యాధులపై ప్రభుత్వ తీరును గమనించేందుకు ఎమ్మెల్సీ నర్తు రామారావు కవిటి డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాంజీ తదితర వైద్యులతో మాట్లాడి డయాలసిస్ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో 19 డయాలసిస్ యంత్రాలు ఉన్నాయని తెలిపారు. వీటి సాయంతో రోజుకు మూడు షిఫ్టుల్లో 57 మందికి డయాలసిస్ చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. సెంటర్‌లో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి సత్వరమే తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు సౌత్‌జోన్ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కె.నితిన్, వసంత్, భరత్, జస్వంత్‌తో పాటు మరో విద్యార్థి కళాశాల నుంచి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.లత తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ కేరళ రాష్ట్రం కాలికట్‌లో యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ వారు సౌత్ జోన్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనున్నట్లు వెల్లడించారు. తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. వీరికి ఉత్తమ శిక్షణ ఇవ్వాలని ఫిజికల్ డైరెక్టర్ భోగేశ్వరరావుకు సూచించారు.

అట్రాసిటీ కేసులో రెండేళ్ల జైలు శిక్ష

పాతపట్నం: భౌతిక దాడి, అట్రాసిటీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ 4వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.ఫణికుమార్ తీర్పు ఇచ్చారని పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య సోమవారం మీడియాకు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం మండల కేంద్రంలోని యశోదనగర్‌కు చెందిన పి.చిన్నమ్మడు తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఇంట్లో రెండో అంతస్తులో నివాసం ఉంటుంది. పక్క ఇంట్లో తూర్పు వైపు జి.అమరావతి కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఈ మేరకు 2020 ఫిబ్రవరి 24వ తేదీన చిన్నమ్మడు, అమరావతిలకు చెందిన ఇంటి డాబా గోడపై పూల కుండి నీరు వెళ్లిన సంఘటనలో, తగాదా రావడంతో కులం పేరుతో తిట్టడంతో పాటు జగ్గుతో కొట్టడం జరిగింది. దీంతో చిన్నమ్మడు పోలీసులకు అమరావతి భర్తపై ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ టి.రాజేష్ కేసు నమోదు చేయగా, ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాద్‌రావు దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో వాదోపవాదాలు అనంతరం ముద్దాయికి రెండు సంవత్సర జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. ఫైన్ కట్టని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్ష ఉంటుందని తీర్పును ఇవ్వడం జరిగిందన్నారు.

గంజాయి వ్యాపారుల ఆస్తులు జప్తు

● డీఐజీ గోపినాథ్ జెట్టి హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు



డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: విశాఖపట్నం రేంజి పరిధిలో గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తు చేస్తామని డీఐజీ గోపినాథ్ జెట్టి హెచ్చరించారు. సోమవారం రాత్రి రేంజి పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో జూమ్ మీటింగ్ నిర్వహించి సమీక్షించారు. గంజాయి పూర్తిస్థాయిలో నిర్మూలించే చర్యల్లో భాగంగా అక్రమ రవాణాకు పాల్పడుతూ, పట్టుబడిన నిందితుల ఆస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటివరకు గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితుల ఆస్తులు (గంజాయి వ్యాపారం ద్వారా కూడబెట్టినవి) గుర్తించి జప్తు చేసేందుకు చేపట్టాల్సిన విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లా నుంచి ఎస్పీ మహేశ్వరరెడ్డి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించకుంటే చర్యలు



కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు తమ సమస్యను వివరిస్తున్న అర్జీదారులు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
● ప్రజా ఫిర్యాదుల నమోదులో 70 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): ప్రజలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులందరూ పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అధికారులంతా కార్యాలయాలు, గృహాల వద్ద ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికోసం ఏపీఈపీడీసీఎల్ అధికారులను సంప్రదించాలన్నారు. అలాగే పీఎంజేఏవై ఆరోగ్య కార్డులు పంచగా మిగిలినవి ఉంటే తక్షణమే వెనక్కి పంపాలని స్పష్టం చేశారు. 70 ఏళ్లు పైబడిన వారికి కొత్త పీఎంజేఏవై కార్డులు నమోదు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కంచిలి, లావేరు, నందిగాం మండలాల్లో పీజీఆర్ఎస్ రీ ఓపెన్ 9 అర్జీలు ఉండగా, రీ ఓపెన్ లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్‌పై ఆయన డివిజన్ల వారీగా ఆర్డీవోలతో సమీక్షించారు.

విన్నపాలు.. వినవలె

➻ శ్రీకాకుళం నగరంలో మండలవీధికి చెందిన రుప్ప రాంబాయి కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. మండలవీధిలోని వారి నివాస గృహం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మించుకుందామంటే, కలెక్టరేట్‌లో ఉద్యోగిగా ఉన్న రుప్ప లక్ష్మణరావు దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన డిక్రీలు, సంబంధిత ఫొటోలు జత చేశారు. కలెక్టర్ చొరవచూపి న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్‌కు) లో అర్జీదారుల నుంచి 50 ఫిర్యాదులను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్వీకరించారు. ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

➻ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు జీతాలు పెంచాలని వారు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

➻ టెక్కలి మండలం పెద్దసాన పంచాయతీకి చెందిన డి.అప్పలరాజు వారి నాన్నమ్మ మరణ ధ్రువీకరణ పత్రం కోసం జూలైలో దరఖాస్తు చేసినప్పటికీ నేటి వరకు జారీ చేయలేదని అర్జీ పెట్టుకున్నారు. అర్జీలు స్వీకరించిన వారిలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు సరికాదు

● ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



కలెక్టర్‌కి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి చేయాల్సింది పోయి, వైఎస్సార్‌సీపీకి ఓటేశారని కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వికలాంగులు, వృద్ధులు, వితంతువుల ఫించన్లు తొలగించడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మండిపడ్డారు. తొలగించిన ఫించన్లను తక్షణమే పునరుద్ధరించాలని, లేకుంటే వారి తరుపున న్యాయపోరాటం చేస్తానన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి వినతి పత్రం అందించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి అచ్చెన్నాయుడి దౌర్జన్యాలు, గుండాయిజం, రౌడీయిజంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. తాటిపర్తి సచివాలయం పరిధిలో సుమారు 20 మందికి పైగా పింఛన్లు రద్దు చేశారని, దర్యాప్తు చేసి ఎందుకు రద్దు చేశారో వివరణ ఇవ్వాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు అర్హుల పింఛన్లు రద్దు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి, ప్రజలందరినీ మోసం చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే బిల్లులు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు అమాంతం విద్యుత్ చార్జీలను పెంచేసి ప్రజలపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. అర్హులైన 38 మందికి సంబంధించిన ఇంటి పట్టాలు రద్దు చేసి టీడీపీకి చెందినవారికి అమ్ముకోవాలని చూస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా కూటమి నాయకులు కక్ష సాధింపులు మానుకొని, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

పేరు అమీర్.. తీరు బడా చోర్

● అత్యాశతో దొంగగా మారిన మెకానిక్
● బైక్ అమ్ముతుండగా పట్టుబడిన వైనం
● 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ మోహనరావు



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పాటు అమీర్ బుయోను చూపుతున్న పోలీసులు

కాశీబుగ్గ: సొంత గ్రామంలోనే మెకానిక్ షెడ్ పెట్టుకొని జీవనం సాగిస్తూ ఒక్కసారిగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ఒక వ్యక్తి అరెస్టైన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ ముండలసాయి గ్రామానికి చెందిన అమీర్ బుయో అనే యువకుడు మెకానిక్ పని నేర్చుకుని తన స్వగ్రామంలో ఇంటివద్ద మెకానిక్ షెడ్ నిర్మించుకుని ఉపాధి పొందుతున్నాడు. అయితే తనకు ఈజీగా డబ్బు సంపాదించాలనే అత్యాశ కలగడంతో మెకానిక్ నైపుణ్యాన్ని దొంగతనాలకు ఉపయోగించాడు. స్నేహితులతో కలిసి రాత్రి సమయాల్లో లాక్ చేసిన ఖరీదైన ద్విచక్ర వాహనాలను దొంగలించడం ప్రారంభించారు. కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, టెక్కలి ప్రాంతాల్లో దొంగతనాలు చేసి, వాహనాలను తన ఇంట్లో ఉన్న సీక్రెట్ గ్యారేజీలో పార్టులు మార్చి అదాయం సంపాదించుకునేవాడు.

నంబర్ ప్లేట్లు మార్చి అమ్మకాలు

అనంతరం ఎక్కువ డబ్బులు వస్తాయని ఆలోచించి దొంగలించిన బైకులకు నంబర్ ప్లేట్లను మార్చి అమ్మకాలు చేపట్టాడు. ఈ క్రమంలో బైక్ అమ్ముతుండగా కాశీబుగ్గ పోలీసులకు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు మొగిలిపాడు వద్ద పట్టుబడి జైలు పాలయ్యారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి పోలీసుస్టేషన్ పరిధిలో రఘునాథ్ పాత్రో అనే వ్యక్తి ఇటీవల అరెస్టయ్యాడని తెలిపారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడి పోలీసులు అలెర్టు చేయడంతో కాశీబుగ్గ సీఐ మోహనరావు, పీసీలు గవరయ్య, షణ్ముఖరావు, ప్రసాద్, నీలకంఠంలు మాటువేసి అమీర్‌ను పట్టుకున్నారని వెల్లడించారు. అనంతరం అతడి వద్ద నుంచి పదిహేను ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఆరు బుల్లెట్లు, 9 పల్సర్ బైకులు ఉన్నాయి. అమీర్ బుయో, రఘునాథ్ పాత్రోతో పాటు ఇంకా పెద్ద ముఠా ఉందని వారిని పట్టుకుంటామన్నారు.

ఉద్దానాన్ని విధ్వంసం చేసే ఎయిర్‌పోర్టు వద్దు

● ప్రజా సంఘాల నాయకుల ధ్వజం

వజ్రపుకొత్తూరు రూరల్: కోనసీమను తలపించే పచ్చని ఉద్దానాన్ని విధ్వంసం చేసే ఎయిర్‌పోర్టును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని ప్రజా సంఘాల నాయకులు కోరారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టేందుకు ఇటీవల ప్రభుత్వం భూ సేకరణ సర్వే చేపట్టిన నేపథ్యంలో, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్దాన ప్రజలతో పాటు ప్రజా సంఘాల నాయకులు సోమవారం సమావేశమై ముక్తకంఠంతో మా భూములు ముద్దు.. ఎయిర్ పోర్టు వద్దు అని నినాదాలు చేశారు. అంతకుముందు ప్రజా సంఘాల నాయకులు బాధిత గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా అమోదం లేకుండా వారి వ్యతిరేక విధానాలు పాలకులు అవలంబించడం సరికాదని మండిపడ్డారు. కార్గో ఎయిర్ పోర్టు పేరుతో సుమారు 14 వందల ఎకరాల భూమిని సేకరించడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, పోతనపల్లి కుసుమ, సార జగన్, పోతనపల్లి మల్లేశ్వరరావు, కుత్తుం హేమక్క, బర్ల జానకి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జీసీటీఏ అధ్యక్షుడిగా చక్రపతి



డాక్టర్ చక్రపతి

పాతపట్నం: శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) అధ్యక్షుడిగా పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.చక్రపతి ఎన్నికైయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జీసీటీఏ రాష్ట్ర లీగల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. కార్యదర్శిగా శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎస్.రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ టి.స్వర్ణలత, కోశాధికారిగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ బి.సతీష్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. చక్రపతిని పాతపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా పోరాటాలతోనే బలమైన ప్రతిపక్షం



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న లిబరేషన్ నాయకులు కార్యకర్తలు

పలాస: రాష్ట్రంలో ప్రజా పోరాటాలతోనే బలమైన ప్రతిపక్షంగా ఉండగలమని సీపీఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తామాడ సన్యాసిరావు అన్నారు. ఈనెల 4వ తేదీన విజయవాడలో జరగనున్న ప్రజాహక్కుల సభ, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ర్యాలీకి సంబంధించిన గోడ పత్రికలను సోమవారం ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడింగ్ కమిటీ సభ్యులు మద్దిల రామారావు, వి.అప్పయ్య, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు, పోతనపల్లి అప్పారావు, మద్దిల జగదీష్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి శరీరం దానం



పాపారావు మృతదేహాన్ని రిమ్స్‌కు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు



కోళ్ల పాపారావు (ఫైల్)

టెక్కలి: తన మరణానంతరం మృతదేహాన్ని రిమ్స్ మెడికల్ కళాశాలకు అప్పగించాలని నమోదు చేసుకోవడంతో ప్రగతి శీల కార్మిక సంఘం సభ్యుడు కోళ్ల పాపారావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో సావిత్రీబాయి పూలే ట్రస్టు ఆధ్వర్యంలో తన శరీరాన్ని దానం చేయడానికి పాపారావు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కుటుంబ సభ్యులు కోళ్ల లోకేష్‌బాబు, కోళ్ల కుమార స్వామి, తియ్యాల ఈశ్వరరావు తదితరులు ప్రజా సంఘాల నాయకుల సహకారంతో శ్రీకాకుళం రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఆర్ వెంకటాచలం, డాక్టర్ కె.వి.రామ్‌ప్రసాద్, అనాటమి డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎం.హేమారాధికలకు మృతదేహాన్ని అప్పగించారు. పాపారావు గతంలో పీపుల్స్ వార్ పార్టీలో పనిచేశారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆ తర్వాత కాకరాపల్లి, సోంపేట థర్మల్ పోరాటంలో పాల్గొన్నారు. నౌపడ రైల్వే ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారు. ఉప్పు కార్మికుల సమస్యల కోసం ఉద్యమ బాట పట్టారు. రైతులు, కార్మికుల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేసేవారు. ఈయన మృతిపై ప్రగతి శీల కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుచ్చ దుర్యోధన, ధర్మారావు, కారి పురుషోత్తం, కేఎన్‌పీఎస్ నాయకులు మిష్క కృష్ణయ్య, బి.ప్రభాకరరావు, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కోత ధర్మారావు, ప్రజా సంఘాల నాయకులు ధనలక్ష్మి, గంగయ్య, లోకనాథం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్

అనుమానాస్పద మృతి



జోక్యో మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ట్రెజరీ విభాగంలోని చెస్ట్‌కు గార్డుగా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సవర జోక్యో (55) గుండెపోటుతో సోమవారం వేకువజామున మృతి చెందారు. పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పలాస మండలం ట్రైబల్ ఏరియాకు చెందిన జోక్యోకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 1992 నుంచి జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎచ్చెర్లలోనే కుటుంబంతో ఉంటున్నారు. శనివారం ఉదయం ట్రెజరీ గార్డుగా ఈయన విధులకు వెళ్లారు. మధ్యలో భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లినా ఆన్ డ్యూటీలోనే ఉండేవారు. ఈ క్రమంలో సోమవారం వేకువజామున మూడు గంటల సమయంలో జోక్యో అపస్మారక స్థితిలో పడిపోయి ఉండడం, వాంతులు చేసుకుని ఉండడంతో మరో సెంట్రీ అనుమానం వచ్చి వెంటనే అంబులెన్సులో రిమ్స్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే జోక్యో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో పోస్టుమార్టంకు తరలించారు.

మృతిపై అనుమానాలు..?

గుండెపోటుతో జోక్యో మృతిచెందాడని అనుకున్నా.. ఈయన మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. వరుసగా మూడు నుంచి ఐదు రోజులు విధులకు ట్రెజరీ గార్డుగా వేస్తుండటంతో విశ్రాంతి లేక ఒత్తిడికి గురై మృతి చెందారా, లేదా అత్యంత కీలకమైన ట్రెజరీకి కాపలాగా ఉన్న సమయంలో ఇంకేమైనా దుర్ఘటన జరిగి ఉంటుందా అన్న అనుమానాలు తోటి సహచరుల్లోనే వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై ఏఆర్ డీఎస్పీ శేషాద్రినాయుడు వద్ద ప్రస్తావించగా ట్రెజరీ పాయింట్ వద్ద నలుగురు సిబ్బందికి విధులు వేస్తుంటామని, మూడు గంటలకోసారి ఆన్‌డ్యూటీలో ఉన్నా విధుల్లో మారుతుంటారని, విశ్రాంతి దొరుకుతుందన్నారు. ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


విశ్రాంత జవాన్‌కు ఘన స్వాగతం



విశ్రాంత ఆర్మీ జవాన్ మల్లేష్‌ను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొండవూరు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కొరికాన మల్లేష్ ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామానికి సోమవారం విచ్చేశారు. ఆయన రాకను ముందుగానే తెలుసుకున్న మాజీ సైనికులు, స్నేహితులు, గ్రామస్తులు పలాస రైల్వేస్టేషన్‌కు అధిక సంఖ్యలో చేరుకొని ఘన స్వాగతం పలికారు. జై జవాన్ అంటూ నినాదాలు చేస్తూ ఘన సన్మానం చేశారు. పలాస రైల్వేస్టేషన్ నుంచి వజ్రపుకొత్తూరు మండలం కొండవూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 2002లో తన 18వ ఏట మద్రాస్ రెజిమెంట్‌లో ఆర్మీలో చేరిన ఆయన, దాదాపు 9 ఏళ్లు జమ్మూ కాశ్మీర్‌లో 19 వేల అడుగుల ఎత్తులో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత దేశ రక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన


ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి క్షేత్రంలో పట్టణానికి చెందిన వేంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీకి నాట్యకారులు నృత్య ప్రదర్శనతో అలరించారని అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శిల్పారామం సాంస్కృతిక కళా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక నృత్య పోటీల్లో స్థానిక అకాడమీకి చెందిన 17 మంది చిన్నారులు వారి ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారన్నారు.

మల్లన్న ఆదాయం రూ.30,30,042

టెక్కలి: టెక్కలి మండలం రావివలస శ్రీ ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో నెల రోజుల పాటు నిర్వహించిన కార్తీక మాసోత్సవాల్లో భాగంగా రూ.30,30,042 ఆదాయం వచ్చినట్లు ఈఓ జి.గురునాథరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2,38,841 ఆదాయం తగ్గినట్లు వెల్లడించారు. ఆదాయంలో భాగంగా శీర్షాభిషేకం టికెట్‌ల నుంచి రూ.10,25,680, శీఘ్రదర్శనం ద్వారా రూ.9,37,260, కేశ ఖండన ద్వారా రూ.69,520, తాత్కాలిక, శాశ్వత హుండీ ద్వారా రూ.9,95,582, ఇతర ఆదాయం ద్వారా రూ.2 వేలు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

యూబీ ఉద్యోగిపై దాడి

● స్థానిక ప్రజా ప్రతినిధి అండతో బరితెగింపు
● కేసు నమోదు చేసిన జేఆర్ పురం పోలీసులు



రణస్థలం యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమ

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఉన్న యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ పరిశ్రమలో ఉద్యోగులు పనిచేయాలంటే కత్తిమీద సాములా మారింది. స్థానిక ప్రజా ప్రతినిధి అండతో రోజు రోజుకూ కొంత మంది కార్మికులు బరితెగిస్తున్నారు. ఏ రోజు ఏ ఉద్యోగిపై దాడి జరుగుతుందోనని భయపడి పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది జూన్ 15న జీఎం, బ్రూవరీస్ హెడ్, ఇతర ఉద్యోగులపై జరిగిన దాడి సంచలనమైన విషయం తెలిసిందే. అలాగే నవంబర్ 30వ తేదిన అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్న కంచరాన రాజులుపై దాడి జరిగిన ఘటన అలస్యంగా బయటపడింది. దీనిపై జేఆర్ పురం పోలీసులు తీవ్ర అంతర్మథం తరువాత కేసు నమోదు చేశారు.

జేఆర్ పురం పోలీసులు, పరిశ్రమ వర్గాలు తెలిపిన వివరాలు ప్రకారం గత నెల 30వ తేదీన మధ్యాహ్నం 1.50 గంటల సమయంలో పరిశ్రమ ఆదేశాల ప్రకారం బి-షిఫ్టుకు కార్మికులను మస్టర్ కార్డు చూసి ఒక్కొక్కరిని సెక్యూరిటీ సిబ్బంది పంపిస్తున్నారు. ఆ సమయంలో అకారణంగా తనను దుర్భాషలాడి తనపై దాడి చేసినట్లు ఏఎస్ఓగా మెయిన్ గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న కె.రాజులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిలో కార్మికులు పాసపు శ్రీనివాసరావుతో పాటు జె.సుందరం, ఎ.లక్ష్మణరావు, పి.తిరుపతిరావు, ఎస్.గంగులు, పి.వెంకటరావు, ఆర్.గోవింద, కె.నాగరాజు, ఎన్.సుబాన్, ఎస్.రమణ ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి అనంతరం కొండములగాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రాజులు చికిత్స పొందాడు. ఈ దాడి తాలుకా దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ దాడి కేసు పరిశీలించిన జేఆర్ పురం పోలీసులు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సోమవారం 10మందిని అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. ఈ దాడికి సంబంధించి యూబీ యాజమాన్యం తీవ్రంగా స్పందించి కలెక్టర్, ఎస్పీతో పాటు సీఎంఓ అధికారులకు తెలియజేసినట్లు పరిశ్రమ ఉద్యోగులు చెబుతున్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీకి సూరిబాబు



సంపతిరావు సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: వరల్డ్ బాడ్మింటన్ ఫెడరేషన్ సూపర్ 100 బాడ్మింటన్ టోర్నీకి అంపైర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియామకమయ్యారు. అస్సాంలోని గౌహతి వేదికగా ఈనెల 3 నుంచి జరగనున్న ఈ మెగా బాడ్మింటన్ టోర్నీకి సూరిబాబు సోమవారం ఇక్కడి నుంచి పయనమయ్యారు. చిలకపాలేం జెడ్పీహెచ్ స్కూల్ పీడీగా పనిచేస్తున్న ఈయన, అంతర్జాతీయ క్వాలిఫైడ్ రిఫరీ బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సీఈవోగా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్‌తోపాటు జిల్లా పీడీ-పీఈటీ అసోసియేషన్‌లో కీలకభూమిక వహిస్తున్నారు. ఈయన నియామకంపై బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, గురుగుబెల్లి ప్రసాద్, హెచ్ఎం చౌదరి లీలావతి, ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు.